క్లుప్తంగా

మహాన్నదానం



అన్న ప్రసాదం స్వీకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: అనపర్తి మండలం పాలమూరులోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం మహాన్నదానం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతా వరలక్ష్మి, సర్పంచ్ గుడాల ధనలక్ష్మి, ఉప సర్పంచ్ సత్తి సురారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు సత్తి కనకారెడ్డి, స్థానికులు సత్తి దొరబాబు, తమలంపూడి ఆదిరెడ్డి, చందు, సత్తి భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు



సత్య కిశోర్, సీఐ

మధురపూడి: ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహిస్తున్నామని సీఐ వై.సత్య కిశోర్ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయని, కోరుకొండ, సీతానగరం, గోకవరం మండలాల్లోని పలు కళాశాలల్లో జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలవుతుందన్నారు. కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో నలుగురు, అంతకన్నా ఎక్కువమంది గుమిగూడి ఉండకూడదన్నారు.



నన్నయలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ



ఊలపల్లిలో సైన్స్ ప్రదర్శనను పరిశీలిస్తున్న హెచ్ఎం అమ్మిరెడ్డి



గుమ్మలూరు హైస్కూల్లో ఉపాధ్యాయులకు సత్కారం



బిక్కవోలులో సీవీ రామన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఉపాధ్యాయులు

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ముందంజ

- నన్నయ వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ
- ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం
- ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు

రాజానగరం: సమాజ సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడిన మహనీయులను ఆదర్శంగా తీసుకుని, యువత శాస్త్ర, సాంకేతిక రంగాలలో ముందంజ వేయాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా యూనివర్సిటీలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన వివిధ కార్యక్రమాలలో ఆమె పాల్గొన్నారు. తొలుత సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి, అంజలి ఘటించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, స్పేస్ టెక్నాలజీ, బయోటెక్నాలజీ పరిశ్రమలను విప్లవాత్మకంగా మారుస్తున్నాయన్నారు.

సమాజ హితం

కోస్తాంధ్ర రేంజ్ డీఐజీ ఎంఆర్ రవికిరణ్ మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశాభివృద్ధికి వినియోగిస్తూ, సమాజ హితంగా యువత పయనించాలన్నారు. సీఎస్ఐఆర్ – ఐఐసీటీ (హైదరాబాద్) ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖరం మలపాక మాట్లాడుతూ ప్రతి ఏడాది సైన్టిఫిక్ ఆడిట్ నిర్వహించాలని, శాస్త్ర, సాంకేతిక రంగాలలో వస్తున్న మార్పులపై చర్చలు జరపాలన్నారు. సైన్స్‌లో వచ్చిన నూతన ఆవిష్కరణల పై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం ప్రొఫెసర్ జి.మురళీకృష్ణ, డాక్టర్ కె.నూకరత్నం రచించిన 'స్పాటియల్ అనాలసిస్ అండ్ జియో విజువలైజేషన్' పుస్తకాన్ని వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.విజయ నిర్మల, డీన్ ఆచార్య వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

- పాతతుంగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిట్ల ప్రదర్శన ఏర్పాటు చేశారు. వీటిలో జీపీఆర్ విధానం ద్వారా కారు ప్రమాదాలను అరికట్టే సెన్సార్ వ్యవస్థ, సూర్యఘర్ ప్రదర్శన, చంద్రమాన్, ఇస్రో రాకెట్లు, కిడ్నీ పని చేసే విధానం, జీర్ణవ్యవస్థ మున్నగు ప్రాజెక్టులు అందరినీ ఆకట్టుకున్నాయి. హెచ్ఎం బీఆర్ కమలాదాస్, ఉపాధ్యాయులు వి.సురేష్‌బాబు, ఎండీఎస్ రెడ్డి పాల్గొన్నారు.



సీతానగరం డిగ్రీ కళాశాలలో సైన్స్ ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ చిట్టిబాబు



బొబ్బిల్లంక హైస్కూల్లో నమూనాలను పరిశీలిస్తున్న ఎంఈవో స్వామి నాయక్

శాస్త్రవేత్తలుగా ఎదగాలి

బిక్కవోలు: మండలంలోని పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు. ముందుగా శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఊలపల్లి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం కొవ్వూరి అమ్మిరెడ్డి, పందలపాకలో ఉన్నత పాఠశాల పాఠశాలలో హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి, బిక్కవోలులో హెచ్ఎం పీవీ ప్రభాకర్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

ప్రయోగశాలలుగా పాఠశాలలు

మధురపూడి: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మండలంలోని పాఠశాలలు ప్రయోగశాలలుగా మారాయి. గుమ్మలూరు హైస్కూల్లో హెచ్ఎం యు.గంగాభవాని ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తొలుత సీవీ రామన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం హెచ్ఎం గంగాభవాని, ఫిజిక్స్ ఉపాధ్యాయురాలు సునీతలను సత్కరించారు. ప్రయోగాలు చేసిన విద్యార్థులకు బహుమతులందజేశారు. కోరుకొండ షిర్డీసాయి స్కూల్ డైరెక్టర్లు పద్మావతి, శ్యామల ఆధ్వర్యంలో విద్యార్థులు తయారు చేసిన సోలార్ సిస్టమ్, పర్యావరణం–పరిరక్షణ, మల్టీపర్పస్ రవాణా తదితర ప్రయోగాలు ఆకట్టుకున్నాయి.



రంగంపేటలో సైన్స్ దినోత్సవం

శాస్త్రీయ వైఖరి పెంపొందించుకోవాలి

రంగంపేట: బాల్యం నుంచి శాస్త్రీయ వైఖరిని పెంపొందించుకోవాలని రంగంపేట ఉన్నత పాఠశాల హెచ్ఎం వి.పార్థసారథి అన్నారు. శాస్త్రవేత్తల జీవితాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. 70 సైన్స్ ప్రాజెక్టుల తయారీలో విద్యార్థులకు సహకరించిన ఉపాధ్యాయులను అభినందించారు.

బహుమతుల ప్రదానం

సీతానగరం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీవీ రామన్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు డాక్టర్ బి.మాధవ్, వైస్ ప్రిన్సిపాల్ హరే రామకృష్ణ మాట్లాడారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు సైన్స్ విభాగాధిపతులు డాక్టర్ మాధవ్, అలేఖ్య, వాణి బహుమతులను అందించారు.

- బొబ్బిల్లంక జిల్లా పరిషత్ హైస్కూల్లో హెచ్ఎం కోలా సత్యనారాయణ సైన్స్ ఎగ్జిబిషన్, సైన్స్ ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఈవో కె.స్వామినాయక్ హాజరయ్యారు.

ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయం



మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, జీఎస్ఎల్ రెడ్డిలను సన్మానిస్తున్న పాస్టర్ జయబాబు తదితరులు

పెదపూడి: ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తి మండలం కాపవరం గ్రామ శివారు రాతింగల మెట్టపై పాస్టర్ కె.జయబాబు ఆధ్వర్యంలో బైబిల్ మిషన్ 15వ వార్షికోత్సవ సువార్త సభలు శుక్రవారం జరిగాయి. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, రాయవరం చాణక్య ఆస్పత్రి అధినేత జీఎస్ఎల్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారిని పాస్టర్ జయబాబు, చర్చి ప్రతినిధులు శాలువా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సత్యంశెట్టి వెంకట రమణ, ఎంపీటీసీ సభ్యుడు మార్రెళ్ల భీష్ముడు, నిడదవోలు శ్రీనివాస్, మామిడాడల హైమావతి, పస్కాడి వీర్రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల పరిశీలన



రంగంపేటలో ఇంటర్ పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న ఏఎస్పీ సుబ్బరాజు

రంగంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన రెండు ఇంటర్ పరీక్షా కేంద్రాలను శుక్రవారం ఏఎస్పీ ఏవీ సుబ్బరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ కళాశాలలోని ఏ కేంద్రంలో 409 మంది మొదటి సంవత్సరం, 262 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు, అలాగే బీ కేంద్రంలో 354 మంది మొదటి సంవత్సరం, 224 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్ష రాస్తారని తెలిపారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్, ఏ కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ జి.హేమ, బీ కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఎస్.మాధురి, డిపార్టుమెంట్ అధికారులు ఏపీఆర్‌వీ ప్రసాద్, ఎంపీఎస్ కృష్ణ, ఎస్సై తోట కృష్ణసాయి ఉన్నారు.

సీతానగరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను లా అండ్ ఆర్డర్ అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు శుక్రవారం పరిశీలించారు. ఆయన వెంట కోరుకొండ సీఐ వై. సత్య కిశోర్, ఎస్సై డి.రామ్ కుమార్ ఉన్నారు. ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో కళాశాలలను పరిశీలించి, పలు సూచనలు చేశారు.

ఘనంగా బాబా మందిర వార్షికోత్సవం



బాబాను దర్శించుకుంటున్న ట్రస్ట్ వైస్ చైర్మన్ మోహనరావు, సభ్యులు

సీతానగరం: ఇనుగంటివారిపేటలోని షిర్డీ సాయిబాబా మందిర 17వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. షిర్డీ సాయి బాబా సేవా సమితి చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ సత్యం మోహనరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి రాత్రి వరకూ పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి సాయిబాబాను దర్శించుకున్నారు. అనంతరం ట్రస్ట్ ఆధ్వర్యంలో ద్వారకామాయి ఫంక్షన్ హాల్లో మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనకు సుమారు 1,500 మంది భక్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో కవల కృష్ణమూర్తి, కాంద్రు సుబ్బారావు, సత్యం సూర్యప్రకాష్, ట్రస్ట్ సభ్యులు సత్యం మదన్‌బాబు, గద్దె సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ గెలలకు ధర పెంచాలి



వినతిపత్రం అందిస్తున్న ఆయిల్ పామ్ రైతులు

బిక్కవోలు: మండలంలోని ఆయిల్ పామ్ గెలలకు తెలంగాణలో ఇస్తున్న ధరను వర్తింపజేయాలని బిక్కవోలు మండల ఆయిల్ పామ్ రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పెద్దాపురంలో పతంజలి ఫుడ్స్ యాజమాన్యాన్ని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఆయిల్ పామ్ రైతుల జిల్లా అధ్యక్షుడు పెండ్యాల బుజ్జిబాబు , ఆయిల్ పామ్ రైతు సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సత్తి రామారెడ్డి, ఆయిల్ జాతీయ కార్యదర్శి ఎస్‌వీవీకే పురుషోత్తమరెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో ఇస్తున్న ధర కంటే ఇక్కడ టన్నుకు దాదాపు రూ.450 తక్కువ చెల్లిస్తున్నారన్నారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కూటమి

- దోపిడీ విధానాలతో పాలన
- మాట్లాడే హక్కును హరిస్తున్నారు
- మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆగ్రహం



కొండగుంటూరులో పార్టీ శ్రేణులతో సమావేశమైన మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: ఎన్నికల సమయంలో అనేక హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలోని పాలకులు.. నేడు ఆ హామీలను గాలికొదిలేశారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా విమర్శించారు. 'నా కార్యకర్తలు – నా కుటుంబం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని సంపత్ నగరం, కొండగుంటూరు గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్ సీపీ శ్రేణులతో సమావేశమయ్యారు. జక్కంపూడి రాజా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రజా సంక్షేమం ఊసే లేదని, దొరికినంత దోచుకో అనే విధానాలతోనే పాలన జరుగుతోందన్నారు. పాలకులు చేస్తున్న తప్పులను ప్రశ్నించే స్వేచ్ఛ లేకుండా పోలీసు జులుం చూపించి, ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ అంటూ ఎన్నికల సమయంలో ప్రకటించిన సంక్షేమ పథకాల జాడే లేదన్నారు. సంపద సృష్టించాకనే వీటి గురించి మాట్లాడతామంటూ, వారి సంపాదనను పెంచుకోవడంలో బిజీ అయ్యారని విమర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, కోకన్వీనర్ గండి నానిబాబు, ఆయా గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు కమతాలలో ప్రయోగ పంటల పరిశీలన



చంద్రేడులో శనగ పంటను పరిశీలిస్తున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు

రంగంపేట: రైతు కమతాలలో ప్రయోగాత్మకంగా సాగు చేసిన వరి, శనగ పంటలు ఆరోగ్యంగా ఉన్నాయని జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు, డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చంద్రేడు గ్రామంలో వ్యవసాయ అధికారి కె.శ్రీనివాస్, రైతుల సమక్షంలో శుక్రవారం ఆ క్షేత్రాలను సందర్శించారు. అక్కడి మినీకిట్ రకాలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. డాక్టర్ నరసింహారావు మాట్లాడుతూ ప్రస్తుత దాళ్లాలో మారుటేరు మినీకిట్ వరి రకం ఎంటీయూ 1426 పనితీరు బాగుందన్నారు. అలాగే చంద్రేడు, పెద రాయవారంలో శనగ రకం ఎన్‌బీ ఈజీ 452 పనితీరును జేజీ 11తో పోల్చితే దిగుబడులు ఆశాజనకంగా ఉందన్నారు. వరి పంట ప్రస్తుతం చిరుపొట్ట దశ నుంచి పాలు పోసుకునే దశకు చేరిందని, పంటను చీడపీడలు తక్కువగా ఆశించాయన్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో మచ్చకంకి నల్లి ఆశించి గింజ ఎరుపు రంగులోకి మారిందన్నారు. దీని నివారణకు లీటర్ నీటిలో ఒక మిల్లీలీటర్ స్పైరో మెసిఫెన్ చొప్పున పిచికారీ చేయాలన్నారు. క్షేత్ర సందర్శనలో చావా శ్రీనివాస్ పొలంలో వరి పంటను పరిశీలించారు. కార్యక్రమంలో వీఏఏ శ్రీలత, మహేష్, సర్పంచి జాస్తి సత్యనారాయణ, అభ్యుదయ రైతులు నెక్కంటి శివ, పిన్నమనేని సుబ్బారావు పాల్గొన్నారు.

ఘనంగా టైలర్ల దినోత్సవం

బిక్కవోలు: టైలర్ల దినోత్సవాన్ని శుక్రవారం బిక్కవోలులో ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీలక్ష్మీ గణపతి టైలర్స్ సంఘం ఆధ్వర్యంలో టైలర్స్ కమ్యూనిటీ హాల్ వద్ద కుట్టు మెషీన్ సృష్టికర్త విలియమ్స్ హోవే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడిగా గౌరీ శంకర్, కార్యదర్శిగా పాలతీర్థం సోమశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రాజానగరం: మదర్ థెరిస్సా సహకార సంఘం ఆధ్వర్యంలో జాతీయ టైలర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కూడలి ప్రాంతంలోని గాంధీ మహాత్ముని విగ్రహానికి సంఘ ప్రతినిధులు పూలమాల వేసి, అంజలి ఘటించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గూడాల గన్నిరాజు, ఉపాధ్యక్షులు నూలు శివకుమార్, ప్రతినిధులు పాల్గొన్నారు.

టీబీ రహిత గ్రామాలే లక్ష్యం

రంగంపేట: మండలంలోని కోటపాడులో శుక్రవారం టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా క్షయ, లెప్రసీ, ఎయిడ్స్ అధికారి డాక్టర్ ఎన్.వసుంధర మాట్లాడుతూ టీబీ రహిత గ్రామాలే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. 2024లో నమోదు చేసిన టీబీ నిర్ధారణ పరీక్షలు, టీబీ రోగాల వివరాలు, పోషకాహార కిట్లను పరిశీలించారు. అనంతరం పెదరాయవరం, వెంకటాపురం, ముకుందవరం, వీరంపాలెం, ఈలకొలను గ్రామాల్లో పర్యటించారు. కార్యక్రమంలో రంగంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి బి.వేణు శ్రీలక్ష్మి, టీబీ సూపర్‌వైజర్ మహేష్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బాపనమ్మకు సినీ నటి అపూర్వ పూజలు



బాపనమ్మ ఆలయంలో సినీ నటి అపూర్వ తదితరులు

పెదపూడి: అనపర్తి మండలం రామవరం గ్రామంలో ప్రసిద్ధి చెందిన బాపనమ్మ తల్లిని శుక్రవారం ప్రముఖ సినీ నటి అపూర్వ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వేద పండితుడు వేదరాజు శ్రీరామ్ పవన్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఈ పూజల్లో అపూర్వ, ఆమె కుమార్తె లక్ష్మీ ప్రజ్వలిత పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అపూర్వ మాట్లాడుతూ అమావాస్య రోజు బాపనమ్మ తల్లిని పూజించడం వల్ల మంచి జరుగుతుందని తన మిత్రులు సబ్బెళ్ల శ్రీనివాసరెడ్డి, నల్లమిల్లి బుచ్చిరెడ్డిల ద్వారా తెలుసుకుని ఇక్కడకు వచ్చానన్నారు. కార్యక్రమంలో సబ్బెళ్ల శ్రీనివాసరెడ్డి(బొచ్చు శ్రీను), నల్లమిల్లి బుచ్చిరెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు సబ్బెళ్ల తిరపారెడ్డి, సబ్బెళ్ల సూర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ విలీన సభను జయప్రదం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆదినారాయణ, కార్మికులు

పెదపూడి: రాజమహేంద్రవరంలో జరిగే ఐఎఫ్‌టీయూ విలీన సభను జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు గుబ్బల ఆదినారాయణమూర్తి పిలుపునిచ్చారు. జి.మామిడాడలో గ్రామ పంచాయతీ కార్మికులతో విలీన సభ పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా ఆదినారాయణమూర్తి మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో జరిగే సభకు కార్మికులందరూ పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు కార్మిక చట్టాలు వర్తింప చేయకుండా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మిక వర్గాన్ని కార్పొరేట్లకు బానిసలుగా చేసేందుకు ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో ఆర్.రాఘవులు, పెండ్యాల రాము, పొట్లూరి అర్జున ప్రసాద్, బంగారు నూకరాజు తదితరులు పాల్గొన్నారు.